క్లుప్తంగా

ఈ చలానాలు రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రవాణారంగ కార్మికులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఆటో, క్యాబ్‌లపై విధించిన ఈ చలానాలను రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ. జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ అనితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె. రామారావు, జి. భాస్కరరావు, బి. ప్రసన్న, వై. ఈశ్వరరావు, పి. ఆనంద్, వై. మోహన్, పి. శేఖర్, బి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పథకం రాష్ట్ర ఎ.డి సుబ్బారెడ్డి

విజయనగరం అర్బన్: పట్టణంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆ పథకం రాష్ట్ర ఎ.డి ఎ. సుబ్బారెడ్డి సోమవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన భోజనం అందించడంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఆయన వెంట డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు, ఎంఈఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడు సోమేశ్వరరావు కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న పీవీఆర్

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఉత్తరాంధ్ర తెలగ సంఘ ప్రతినిధి పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్) సోమవారం రూ. లక్ష ఆర్థిక సాయం చేశారు. పూసపాటిరేగ మండలంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఉత్తరాంధ్ర తెలగ ఆత్మగౌరవ సభకు హాజరై, తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తూ మండవ కురిటికి చెందిన కొబిశెట్టి సోమేశ్వరరావు (73) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న పీవీఆర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి..



అధికారులకు సూచనలు చేస్తున్న విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు

విజయనగరం క్రైమ్: వివిధ పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని డీఎస్పీ ఆర్. గోవిందరావు అన్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రైమ్ రికార్డులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ కోరాడ రామారావు, ఎస్సై ఐ.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ అధికారులు

గజపతినగరం: మండలంలోని దావాలపేట మహంకాళీ అమ్మవారి ఆలయంలో దేవదాయశాఖ విజయనగరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కించారు. అమ్మవారికి భక్తులు హుండీలో కానుకగా సమర్పించిన ఆదాయం రూ.2,12,668 వచ్చిందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అమ్మవారి దేవస్థానం చైర్మన్ పి.చిన్నంనాయు డు, స్థానిక సర్పంచ్ బూడి జ్యోతి, ఆలయ ఈఓ కరి శ్రీరామ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పోలీస్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకూ ఓ పార్కు..

- రూ. కోటి వ్యయంతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో వేగంగా సాగుతున్న పనులు
- నగరంలోని శిథిలావస్థకు చేరిన నెహ్రూ పార్కును చిల్డ్రన్ పార్కుగా అభివృద్ధి
- ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్, వాటర్ ఫౌంటెన్‌ల ఏర్పాటు
- పనులు పర్యవేక్షించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



చిన్నారుల కోసం ప్రత్యేకంగా తయారవుతున్న పార్కు ప్రాంగణం

విజయనగరం: నగర సిగలో మరో అభివృద్ధి కలికితురాయి చేరనుంది. గత టీడీపీ పాలకులు పదవుల కోసం పాకులాడి కార్పొరేషన్ హోదాను తాకట్టుపెట్టి విజయనగరం అభివృద్ధికి మోడాలొడ్డితే.. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ గతంలో ఎన్నడూ జరగని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ నగర రూపురేఖలు మార్చడం విశేషం. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చురుగ్గా వ్యవహరిస్తూ నగర అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కుల అభివృద్ధిలో భాగంగా చిన్నారుల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మహిళల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేసి మహిళామణుల ఆదరణ పొందుతుండగా... తాజాగా శిథిలావస్థకు చేరిన నెహ్రూ పార్కును చిన్న పిల్లల పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం పార్కు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతుండగా... కొద్ది రోజుల వ్యవధిలో పార్కును ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నారు.

రూ.కోటి వ్యయం..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నెహ్రూ పార్కు త్వరలో చిన్న పిల్లల పార్కుగా రూపాంతరం చెందనుంది. మొత్తం రూ. కోటి నిధులతో పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కు ఆవరణమంతా ఆహ్లాదం కలిగించేలా అందమైన మొక్కలు నాటుతున్నారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలాగే వాటర్ ఫౌంటైన్, బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు.

పనుల పరిశీలన..

నెహ్రూ పార్కులో జరుగుతున్న పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు



పార్కు ఆవరణలో పిల్లలు ఆడుకునేందుకు సిద్ధం చేసిన ఆట పరికరాలు

సోమవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తిలతో కలిసి పార్కు ప్రాంగణంలో కలియతిరిగి.. పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ.. నగరంలోని 17వ డివిజన్‌లో ఉన్న నెహ్రూ పార్కును చిన్న పిల్లల పార్కుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల హయాంలో నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పార్కు పనుల ప్రగతిని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కమిషనర్, తదితరులు

వైభవంగా చండీహోమం



మహా చండీహోమంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీ దేవునినెలివాడలో వెలసిన రాజరాజేశ్వరి ఆలయంలో మహా చండీహోమం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లెంక రామయ్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాయజ్ఞంలో సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితుడు గొడుగుల వెంకటేష్‌శర్మ తమ బృందంతో వేద మంత్రోచ్చారణల నడుమ హోమం ఘనంగా జరిపించారు. మధ్యాహ్నం సుమారు 5 వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ భజనబృంద ప్రతినిధి లెంక పైడినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు.

సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ ఆదర్శప్రాయురాలు



సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మను సన్మానిస్తున్న సెంచూరియన్ చాన్సలర్ రాజు, తదితరులు

- సెంచూరియన్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ అందరికీ ఆదర్శప్రాయురాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో శాంతమ్మను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతమ్మ 96 ఏళ్ల వయసులోనూ విద్యార్థులకు పాఠాలు బోధించడం గొప్ప విషయమన్నారు. వివిధ రంగాల్లో అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని గుర్తు చేశారు. ప్రొఫెసర్ శాంతమ్మ మాట్లాడుతూ.. మరో నాలుగేళ్లలో వర్సిటీలో తాను శత జన్మదినోత్సవం జరుపుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, జోన్ చైర్మన్ మురళీ కృష్ణంరాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీరామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆశయాలు గొప్పవి



అధికారులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

- నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామారావు

నెల్లిమర్ల: గాంధీరామ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆశయాలు గొప్పవని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. నగర పంచాయతీ జరజాపుపేటకు చెందిన సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ అధికారులు, ఉద్యోగులను సోమవారం సత్కరించారు. జరజాపుపేటకు చెందిన గరివిడి ఎంఈఓ, ఉత్తమ అధికారి అవార్డుగ్రహీత పోలుబోతు రామారావు, పదోన్నతిపై మెరకముడిదాం ఎంఈఓగా నియమితులైన మాత చంద్రశేఖర్, జీఎల్ఐ కార్యాలయ సూపరింటిండెంట్‌గా పదోన్నతి పొందిన ధనుంజయరావు, స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన కాళ్ల రాధ, జరజాపుపేటలో మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడిన కాంట్రాక్టర్ బుగత శ్రీనులను సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, ఉత్తమ సేవలందించిన వారిని ప్రోత్సహించనప్పుడే మరికొంతమంది ప్రేరణ పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, సొసైటీ వ్యవస్థాపకుడు మద్దిల సన్యాసిరావు, బేతా మహాలక్ష్మి, గ్రామపెద్దలు పి. నారాయణమూర్తి, నల్లి శ్రీను, టి. నారాయణమూర్తి, అవనాపు సత్యనారాయణ, తాలాడ సన్నిబాబు, గుర్ల ఎంఈఓ ఎస్. భానుప్రకాష్, చిప్పాడ రమేష్‌కుమార్, మాతా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

విజయనగరం క్రైమ్: నగరంలోని గుమ్చీ జంక్షన్ వద్ద సోమవారం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సింహాచలంను ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీ కొనడంతో గాయాలయ్యాయి. వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో అటుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడ్ని సింహాచలం నిలువరించే ప్రయత్నం చేశాడు. అయితే వాహనచోదకుడు స్పీడ్‌గా వెళ్లిపోవడంతో సింహాచలంపక్కు పడిపోవడంతో చేయి విరిగిపోయింది. బాధిత కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కోరాడ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం తరలిస్తే చర్యలు

నెల్లిమర్ల రూరల్: అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఎర్ర చందనం కలపను తరలిస్తే చర్యలు తప్పవని డీఎఫ్ఓ ఎస్. వెంకటేష్ అన్నారు. మండలంలోని ఎంబీరేయగుళ్ల కొండపై ఉన్న ఎర్ర చంద్రనం చెట్లను సోమవారం ఆయన పరిశీలించారు. హుద్‌హుద్ సమయంలో నేలకొరిగిన వృక్షాల వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని రేంజర్ అప్పలరాజుకు సూచించారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సూచించారు.

కిసాన్ మేళా ప్రారంభం రేపు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో ఏర్పాటు చేయనున్న కిసాన్‌మేళాను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ప్రారంభిస్తారని వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి తెలిపారు. వర్సిటీ ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, కిసాన్ మేళా కార్యక్రమాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని, ఇందుకోసం 34 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి



పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న డీఆర్‌ఓ అనిత, తదితరులు

- డీఆర్‌ఓ అనిత

విజయనగరం అర్బన్: మహిళలు, యువతకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించాలని డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత అన్నారు. రిజర్వ్‌బ్యాంక్ సూచనల మేరకు సోమవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతపై వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆర్‌బీఐ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు 2016 నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 'మేక్ ఏ రైట్ స్టార్ట్ – బికమ్ ఫైనాన్షియల్లీ స్మార్ట్' అనే నినాదంతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ త్రివినాగ్, ఆర్‌డీఓ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు సుమబాల, మురళీకృష్ణ, ఏఎల్‌డీఎం ప్రత్యూష, పశుసంవర్ధక శాఖ జె.డి విశ్వేశ్వరరావు, మెప్మా పీడీ సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందుకుంటున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యప్రసాద్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఉన్న మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని నేతాజీ మాజీ సైనికుల సంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ ప్రతినిధులు జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ పి.సత్యప్రసాద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సైనికపురి కాలనీ, సీఎస్‌డీ క్యాంటీన్, ఈసీహెచ్ఎస్ క్లినిక్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పెద్దింటి గుణాకరరావు, వైస్ ప్రెసిడెంట్ సిరిపురపు శ్రీనివాసరావు, కోశాధికారి ప్రకాశరావు, ఏసుదాసు, గణపతిరావు, బొడ్డేపల్లి జగన్నాథం, జి.శివకుమార్, డి.శ్రీనివాసరావు, పి.మన్మథరావు, ఎస్ఎస్ రాజు, వై.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ తీర్థం



మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు



పరుగు తీస్తున్న గుర్రం

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గ్రామ దేవత మరిడిమాంబ తీర్థం సోమవారం ప్రారంభమైంది. నిర్వాహకులు ఆలయాన్ని సుందరంగా అలంకరిం చారు. తొలిరోజు అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల గుర్రాల పరుగు పందెం పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 16 గుర్రాలు పాల్గొన్నాయి. మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. మంగళవారం అంతర్ జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నారు.

ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ

విజయనగరం రూరల్: ఆధార్ సేవలు అందించడంలో వచ్చే సాంకేతిక సమస్యలు, సందేహాల పరిష్కారాలపై గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఆపరేటర్లకు జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ విభాగం జిల్లా సమన్వయకర్త జీఎస్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆధార్ సేవలు అందించడంలో పాటించాల్సిన కొత్త మెలకువలు, ఆపరేటర్ల సందేహాలను కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన బాలప్రసాద్, వీవీఎస్ సుందరం నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారులు, జిల్లా సమన్వయకర్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎస్ నిర్మలాదేవి



శిక్షణకు హాజరైన ఆపరేటర్లు

బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలి..

- తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ

పూసపాటిరేగ: బీఎల్‌ఓలు ఎన్నికల విధులలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రవల్లికప్రియ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు సెషన్ –6 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు ఓటర్లు స్లిప్‌ల పంపిణీ నుంచి ఎన్నికల పోలింగ్‌పూర్తయిన వరకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. ఓటర్ లేదా ఆయన కుటుంబంలోని వయోజన సభ్యుడికి వీఐఎస్‌ను అందజేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకునే వ్యక్తి సంబంధిత నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్ రిటర్నింగ్ అధికారికి ఫారం–12డి ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు మీనా పట్నాయక్, మహేంద్రవర్మ, తదితరులు పాల్గొన్నారు.